కథానిక

# కలియుని దారులు

జె. వరలక్ష్మి

"ఇంక మనం యింతేనా? ఇలా వేరై పోవల్సిందేనా?"

"......... ........"

"ఇంత కరినురాలివనుకోలేదు నేను నిన్ను కోరుకున్నంతగా నువ్వు నన్ను కోరుకోవడం లేదు. అసలు రహస్యం అది. ఈ విషయం ముందే తెలుసుకునుంటే, నలుగురిలో యిలా అపహాస్యం పాలయే వాడిని కాదు."

"పోనీ యిప్పుడు తెలుసుకో ఇన్నెందుకు, మనిద్దరం కలిసి జీవించేకంటే నీవు నీవు గానూ, నేను నేనుగానూ బతికితేనే ఎక్కువ రాణించగలుగుతాం."

"అంటే?"

"అంటే ఏమీలేదు జీవితంలో ప్రేమించడం, ఒక వ్యక్తి ప్రేమకోసం జీవించటం కంటె సాధించవలసినవి విలువైనవి యింకెన్నో ఉన్నాయి."

"అవన్నీ మనిద్దరం కలిసి సాధిద్దామనేగా నే ననేది. మాట్లాడవేం? సమాధానం లేదా?"

* * *

రావుగారింటికి మధు ఓసారి వచ్చాడు. రావు చెల్లెలు లీల. ఐదవ ఫారం హైస్కూలులో చదువుకుంటూ ఉంది. పొట్టి జడ, పొడుగాటి పరికిణీ, చెవులకు లోలకులు పెట్టుకుని చెంగు చెంగున గంతులేసే లీలను రావు ఒకనాడు పరిచయం చేశాడు మధుకు "మా చెల్లెలండీ చాలా చురుకైనది. చాలా వృద్ధిలోకి వస్తుందని అనుకుంటున్నాం కాని ఎక్కడ తప్పితే అక్కడ ఆపేస్తాం చదువు," అన్నాడు లీల వైపు చూస్తూ. మధును చూస్తే లీలకు నిజంగా భయం, సిగ్గు, వల్ల మాలిన గౌరవం పుట్టు కొచ్చినవి. ఒక్కమాట కూడా సమాధానం చెప్పలేకపోయింది ఉంగరాల జుట్టు, కళ్లకి జోడు, సన్నటి మనిషి, చక్కటి కోలమొహం, చేతులు, కళ్లు తిప్పుకుంటూ అతను మాట్లాడే ఆ తీరు చూస్తే లీలకు, తను యింతవరకూ చూసిన ప్రపంచంలో యిటువంటి మనిషీ, యింత తెలివైనవాడు కన్పించనే లేదనిపించింది వాస్తవానికి వాళ్ళన్నయ్యే అందంగా ఉన్నా, అతని ముందు అన్నయ్య రద్దనిపించాడు ఆనాడు లీలవాళ్ళస్కూల్లో వార్షికోత్సవం. లీల పట్టలేని సంతోషంతో తనకు బహుమతులుగా వచ్చిన పుస్తకాలు, వెండి కప్పులు మోసుకుని యింటికి వెళ్తూంటే "లీలావతిగారూ" అని పిలిచినట్లయింది. వెనక్కితిరిగి చూసేసరికి మధు ప్రత్యక్షం సిగ్గంతా ఏమైపోయిందో మరి చేతిలోఉన్న పుస్తకాలన్నీ చూపించి, హెడ్ మాస్టరుగారు తన్ను గురించి చెప్పినమాటలన్నీ చెప్పింది లీల అతనూ ఒక్కొక్కటే పరీక్షిస్తూంటే శ్రీమతి విజయలక్ష్మి పండిట్ వ్రాసిన "సొ ఐ బికేమ్ ఏ మినిస్టర్" అనే పుస్తకం పైకివచ్చింది. "ఓ! ఇది మీకు బాగా ఉపయోగపడుతుందని యిచ్చినట్లున్నారే! మీరూ యిలా అవాలి ఒక నాటికి" అన్నాడు మధు తను చెప్పే కబుర్లన్నీ వింటూ, తన పక్కనే నడుస్తూ యింటి దాకావచ్చి దిగబెట్టి వెళ్ళాడు 'నీకేమీ తెలియదు' అని అమ్మా, వదినా కోప్పడుతుంటే, "మీరు" అని గౌరవంగా పిలుస్తాడేమిటి చెప్మా యీ మధు, అనుకున్నది లీల. పైగా తన కబుర్లన్నీ అన్నయ్య సయితం పిచ్చివాగుడు కింద కట్టేస్తుంటే, యీ మధు ఎందుకు వింటున్నాడు యింత శ్రద్ధగా, అని అనుమానంకూడా వేసింది

* * *

లీల పెరిగి పెద్దదైంది. ఆమెతో పాటు

చదువుకూడా పెరిగింది. స్కూలు ఫైనలు ప్యాసై కాలేజీలో చేరింది. కాలేజీ, అక్కడి వాతావరణం అంతా కొత్తగాఉంది. ఎవరూ నిజంగా పాఠాలు చదువుకోడానికే వచ్చినట్లు కన్పించలేదు. కొత్తమనుషులు, వేర్వేరు మన స్తత్వాలు కలిగిన అమ్మాయిలు కన్పించారు. అంతా కొత్తగా ఉన్నది.

అప్పుడే కాలేజీనించి వచ్చి, ఒక్కగాఉంటే వరాండాలో కుర్చీలోకూర్చుని కాలేజీని గురించిన ఆలోచనల్లో మునిగిపోయింది లీల. ఇంతలో 'ఏమండీ' అంటూ తలుపు తెరుచుకుని లోపలికి వచ్చిన వ్యక్తిని చూడగానే ఎక్కడలేని ఖంగారూ కలిగింది. "మా అన్నయ్య లేడండీ, ఇప్పుడే బయటికి వెళ్ళాడు" అన్నది జంకుతూ. 'మీ వదినెగా రున్నారా?' "ఆఁ. వంట చేసుకుంటు న్నది." "పోనీ మీతో మాట్లాడుతాను. నిల్చు న్నారేం? కూర్చోండి" అంటూ మరో కుర్చీలో కూర్చున్నాడు మధు చొరవగా. "కాలేజీ ఎలా ఉందండీ? పాఠాలు ప్రారంభించారా? అన్ని పుస్తకాలూ కొన్నారా?" అని రుమాలుతో మొహం తుడుచుకుంటూ ప్రశ్నలు ప్రారం భించాడు. "పాఠాలు ప్రారంభించారు. అన్ని పుస్తకాలూ కొన్నాను గాని మాగ్నెటిజం, ఎలెక్ట్రిసిటీ టెక్స్టులు, లాగరిథమ్స్ బుక్ కొనా లండీ" అన్నది తలొంచుకుని. 'మాగ్నటి జమా! మీరే ఒక మాగ్నెట్ అయితే, మీ రింకా మాగ్నెటిజం చదవటం ఎందుకూ!" అన్నాడు ఆశ్చర్యంగా. ఏమిటో యీ మాటలన్నీ లీలకు కొత్తగా, విచిత్రంగా విన్పించినవి. కాని సాహ సించి ఏమీ సమాధానం యివ్వలేకపోయింది. ఏమీ అడగలేకనూ పోయింది. మధు మాత్రం ఆ రోజునించీ మనస్సులో మెదుల్తూనేఉన్నాడు. తరచు అతను కన్పిస్తూనే ఉన్నాడు. ఎన్నో విషయాలు మాట్లాడుతూనే ఉన్నారు. ఇప్పు డింక లీల పెద్దపెద్ద విషయాలను గురించి మాట్లాడడం నేర్చుకున్నది. తనకు తెలియని విషయాలన్నీ అతనికి తెలుసుననే దృఢనమ్మకం ఏర్పడి పోయింది. నిండాతీసి మధు డిగ్రీ కూడా తీసుకోలేదు. బి.ఏ. పరీక్షలకు చదువుతూ, పరీక్షల ముందు జైలు కెళ్ళాడు కాని అప్పటి పరిస్థితుల్లో తనకంటె ఎక్కువ చదువుకున్న వాడేగా! అది కాదు. అసలు ప్రపంచంలో అతనికి తెలియని విష యాలు లేవనే లీల ప్రగాఢ విశ్వాసం. మధు వచ్చే జాడలు కన్పిస్తేనే సంబరపడిపోయేది. అతనితో గడిపిన కాలం చాలా మధురమైనదిగా తోచేది.

* * *

లీల బి ఏ. చదువుతోంది. కాలేజీ డిబే టులో మాట్లాడి ఒకసారి ఒక గోల్డు మెడల్ గెలిచింది ఇంట్లోవాళ్లందరూ మెచ్చుకున్నారు. మధు వింటే యింకా సంతోషిస్తాడని ఉబలాట పడింది కాని తీరా అతనువచ్చి "యీ మెడల్ కేం. నీవే ఒకళ్లకు మెడల్వి కాబో తుంటే, యీ మెడల్ ఎందుకు!" అన్నాడు, నవ్వుతూ. 'మీరు' అని పిలిచేవాడు 'నీవు' చేశాడు యివాళ. లీలకు కొన్ని ప్రశ్నలు అడ గాలనే ధైర్యం, అవకాశం వచ్చింది. "ఏమండీ! నేనంటే మీకెందుకు యింత అభిమానం?" అన్నది. "నీవా! నీవు పక్కనఉంటే ఎంత పనైనా చేయగలను. నిన్ను నాకు ఎవరయినా యివ్వగలుగుతే, నాకు ప్రపంచంలో కావల్సిన దేముంది? నీ ముందర ఉన్నంతసేపూ ఏదో లోకంలో ఉన్నట్లుంటుంది" అని చెప్పకు పోయినాడు. లీలకు యీ మాటలు అర్థం అయీ అవనట్లుగా ఉన్నాయి. ఒక పక్క తన మీద మధుకు గల ప్రేమాభిమానాలకు గర్వం, మరొక పక్క నిరాశ కలిగినవి. మధు ఎప్పటికీ తనవాడైపోతే! అమ్మో! అదెలా సంభవం. అతను వేరు. తను వేరు

* * *

లీల మద్రాసు చదువుకు వెళ్లటంతో మధుకు దూరమైపోయింది. ఆరుమాసాల తరవాత లీలను కలుసుకున్నాడు. "లీలా! నిన్నెప్పుడూ కనీసం చూడగలుగుతూ ఉండాలి! నేను ఓ పెంపుడు కుక్కనై పుడితే ఎంత బాగుండేది! ఎప్పుడూ నీతో కూడా ఉండే వాడిని. మనిషి కాబట్టేగా నీతో ఉంటే నీకు తప్పు. పోనీ యిప్పుడు మాత్రమేం. నీవొక ఆఫీసరువైన తర్వాత, నన్ను నీ వంట వాడిగా తీసుకో. రెండు

పూటలు భోజనంపెట్టి, రోజుకు మూడు సిగరెట్లు, సంవత్సరానికి రెండు బనీన్లు, రెండు లుంగీలు యివ్వు-చాలు. నీకు నమ్మిన సేవకుడి లాగా ఉంటాను. వీటన్నిటికీ నీవు ఒప్పుకోక పోతే, నీ యింటి కెదురుగా ఒక కిల్లీ దుకాణమయినా పెడతాను. అలా అయినా అస్తమానం నిన్ను చూస్తూ ఉండొచ్చుగా'' అని మధు తన మనస్సులోని ప్రేమనంతా వలకబోస్తుంటే లీలకు విపరీతమైన నవ్వు వచ్చింది.మధు కూడా సిగ్గు పడుతూనయినా నవ్వక తప్పలేదు. ''ప్లేటు మార్చేశావే ఇదివరకు నీ జీవితాన్ని దేశానికి అంకితం చేస్తానన్నావ్! ఇప్పుడు నాకు అంకితం చేస్తావా?'' అని లీల కిలకిలా నవ్వుతూ అంటే మధు చిన్నబుచ్చుకున్నాడు. ''ఇతరుల బాధ నీకేం తెలుస్తుంది నా జీవితంతో చెలగాటం ఆడుతున్నావని తెలుసునా?'' అని మధు అంటే, ''తెలుసును కాబట్టే-ఇది జీవితం, చెలగాటం వద్దు అని చెబుతున్నాను'' అన్నది లీల పెంకిగా

''అబ్బా! ఎంత పెంకితనం. ఎంత నిర్దయ. నీకు నిజంగా మనస్సులో ఏమీలేదా నేనంటే? ఉన్నదున్నట్లు చెప్పు దాచుకోకుండా? ఇంకా ఎన్నాళ్ళు యిలా పరీక్షచేస్తావు నన్ను?''

''…. …. …. …. ….''

''నీ తాహతుకు, అంతస్తుకు తగినవాడిని కాదనేగా నీ ఉద్దేశ్యం''

''ఆ మాట ఎవరన్నారూ? నీకున్న డబ్బుతో నీకూ ఒక తాహతు ఉందిగా?''

''అయితే మరి గౌరవం, అభిమానం, పోనీ ప్రేమ లేదా?''

''ప్రేమంటే ఏమిటి? ఎలా ఉంటుంది?''

''ఏమిటో నాకూ తెలియదు. నేను చాలా సామాన్యుడిని. నాకు నీవు కావాలి అంతే అదే నా కోరిక''

''ఎంత చెడ్డ కోరిక? నాకు యిక వ్యక్తిత్వం 'నావి' అనుకునే కొన్ని అభిప్రాయాలు లేవా?''

''లేవన్నానా? ఉన్నవి కాబట్టే స్వతంత్రంగా ఆలోచించుకోమంటున్నాను.''

''వాదనతో ఏం ప్రయోజనం? నీవు రాజకీయవేత్తవనీ, మాటలు ఎలాపడితే అలామార్చి వాడగలవనీ నాకు తెలుసు.''

''నీవు మాత్రం తక్కువా? యిన్నివేలు పోసి 'లా' చదువుతున్నందుకు ఆ మాత్రం నేర్చుకోలేదా? మామూలు స్త్రీలే అయితే నన్ను యిన్ని తిప్పలు పెడతావా? అసలు అందుకేగా నిన్ను నేను గౌరవించేది. అమ్మో! ఎంత గడుసుదానివి?''

''నేనంటే నీకు గౌరవం ఏమిటి నామొహం!''

''కాక మరివన్నీ ఎందుకు? నేను వచ్చి యిలా నిన్ను ప్రాధేయపడటమేమిటి చెప్పు?''

''నేను బతిమాలానా నిన్ను యివన్నీ చేయమని?''

''లేదు నేనే చేస్తున్నాను, బుద్ధిలేదు కాబట్టి.'' అన్నాడు మధు

''పోనీ చేయకు. ఇక ముందు మానుకో.''

''ఇంతకీ యిలా మొండివాదనేకాని, నిర్ణయం చెప్పవు కదూ!''

''నిర్ణయం ఏముంది గనక! ఇప్పటికే నీవు వూహించి కనుక్కోవలసింది ఆ నిర్ణయం ఏమిటో!''

* * *

మళ్ళీ ఒక సంవత్సరం కాలగర్భంలో కలసిపోయింది. మధు జీవితంలో అనేక ఒడుదుడుకులు వచ్చాయి కాని లీలమీద ఉన్న కొన ఊపిరి ఆశ చావలేదు. మనిషి చిక్కిపోయాడు. బతుకంటేకూడా అదివరకు ఉన్న భావాలు మారిపోయాయి. కాని లీల మాత్రం మరొక విధంగా పెరుగుతూ ఉంది

''లీలా! ఇక నీవు చెప్పగలిగింది ఏమీ లేదా?''

''…. …. …. …. ….''

''కుటుంబం, ప్రతిష్ఠ-అవన్నీ అడ్డు వస్తున్నాయి కదూ నీకు! నాకు మాత్రం నీకులాగా కుటుంబం మొదలైనవి లేవూ? వాళ్ళందర్నీ వదులుకోవడానికి సిద్ధపడటం లేదూ!''

''నీ పరిస్థితి వేరు.''

''ఇంత పిరికిపంద వనుకోలేదు. చదువుకున్నావు నీ జీవితంలో నీకు ఏం కావాలో నిర్ణయించుకోగలుగుతావు అనుకున్నాను.''

"ఇందులో పిరికితన మేముంది. ధైర్యం అనేది గొప్ప విషయాలు సాధించడానికిగాని యిలాంటివాటికి కాదు ఒక్క నీకోసం నా సర్వస్వం త్యాగం చెయ్యటం అనవసరం, తెలివితక్కువ అనుకుంటాను నేను, నేనుగానే ఉంటే కొంత కృషి చేయగలిగితే నాకే కాక సమాజానికి కూడా కొంత ఉపయోగపడగలుగుతాను. ప్రేమ అనేది మనిషికి బతుకులో వెలుగును చూపించగలిగినా, కేవలం ప్రేమ ఒక్కటే ముఖ్యంగాదు. మనిషి జీవితకాలంలో చేయగలిగినవి యింకెన్నో ఉన్నాయి."

"నేను అలా అనుకోవటంలేదు. నా కున్న ఆశయాలకు తోడు నీవుకూడా ఉంటే సమాజానికి ఎక్కువ ఉపయోగపడగలుగుతాను అనుకున్నాను ఇప్పటికీ అనుకుంటున్నాను."

"మనస్తత్వాలలోనే మనిద్దరం వేరు నేను కొన్నిటికి యిచ్చే విలువ నీవు యివ్వటం లేదు."

"ఇంతకీ నీ దృష్టిలో నేను ఒక అంతస్తు తక్కువలో ఉన్నాను నీకు నేనంటే గౌరవం లేదు అదేనా పర్యవసానం."

"అది గౌరవం అను అభిమానం అను. మరేదైనా అను. నాకు పేర్లతో నిమిత్తంలేదు నీవంటే నాకు ఏదో ఒకభావం ఉన్నమాట నిజమే! ఒప్పుకుంటాను అది ఎప్పుడూ ఉంటుంది ఎప్పటికీ చెరిగిపోదు' మనం స్త్రీ పురుషులుగా కలిసి జీవించనంత మాత్రాన, ఆ మధురమైన భావం పోవాలని ఎక్కడుంది? నీ వెక్కడున్నా, నే నెక్కడున్నా అది అలాగే ఉంటుంది!"

"ఏంలాభం! దూరంగా ఉండి ధర్మ పన్నాలు, ఏవో అర్థంకాని కబుర్లు చెబుతావు కాని నా జీవితంలో అడుగుపెట్టడానికి మాత్రం సాహసించవు"

"సాహసించడానికి తగిన కారణం ఏముంది?"

"ఇంతేనా! నన్ను పోగొట్టుకున్నందుకు జీవితంలో తర్వాత విచారిస్తావు. నీవు పావడాలు కట్టుకున్న పసిపిల్లప్పటినుంచీ నీమీద మమకారం పెంచుకున్నాను. పెరిగి పెద్దదానివై అన్నివిషయాలూ తెలిసుండి, నా హృదయాన్ని అర్థం చేసుకోలేక పోతున్నావు అనక విచారిస్తావు"

"జీవితంలో కొన్నిటికి విచారించాల్సి ఉంటుంది. కొన్నిటికి సంతోషించాల్సి ఉంటుంది. ప్రతిదానికీ భయపడిపోతే ఎలా? నిజంగా విచారించాల్సేవస్తే విచారించకతప్పదు కాబట్టి విచారిస్తానేమో!" అంది లీల.

"ఎంత గుండె నిబ్బరం. అయితే నీ జీవితంలో మరేవ్యక్తి ప్రవేశించడమనేదే జరగదా? జీవితమంతా యిలాగే గడిపేస్తావా?"

"జరగొచ్చు దానికేం అవసరమనుకున్నప్పుడు, నీకు కబురు పంపిస్తానులే. అప్పుడు వద్దువుగాని!"

"అప్పటికి నేను యీ ప్రపంచంలో బతికి ఉండకపోతే?—"

"అవన్నీ అయితే, గియితే మాటలుకదా!"

"సరే! గుడ్‌బై! వస్తాను నా మొహం నీకు మళ్లీ కనపడనీయను"

"అదేం? మనం ఎప్పటికీ స్నేహితులమే! పోనీ ఒకళ్ళ శ్రేయస్సు ఒకళ్లు కోరుకుంటాం గదా చెరుపు జరగాలని కోరుకోం గదా! అంటే స్నేహితులమన్న మాటేగా!"

"ఇంకా శ్రేయస్సేమిటి నా తలకాయ, నీవు లేని శ్రేయస్సేమిటి నాకు! నీకు నీవే నాకు నేనే యిప్పుడేగా చెప్పావు అంతేనని నీ మొహం చూసినప్పుడల్లా నాకు బాధగా ఉంటుంది ఒట్టి అసమర్థుడిని, నిన్ను పొందలేక పోయాననే భావం కలుగుతుంది. నీకేం? అలా అలా ఒక్కొక్క మెట్టు పైకెక్కిపోతావు నీకు నేనంటే ఒకరకమైన ఉదాసీనతే మిగిలిపోతుంది"

"నన్ను యింతేనా అర్థం చేసుకున్నావు, యిన్ని సంవత్సరాలుగా స్టడీ చేసి?" అంది లీల, హేళనగా

"ఎలా అర్థంచేసుకుంటేనేం అంతా అనవసరం. ఏదో ఒక పీడకల గడిచిపోయింది" అంటూ లేచాడు మధు, కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ.

ఏమిటో తెలియని అయోమయస్థితిలో అతని వైపే చూస్తూ ఊరుకుంది లీల. ★